# సాక్షి
## భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం । 16 । జూన్ । 2024






**జాబ్‌మేళాకు స్పందన**

కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. పలువురు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. 8లో



**నిర్లక్ష్యంగా ఫిట్‌నెస్ టెస్టులు**

విద్యాసంస్థల బస్సులకు రవాణా శాఖ అధికారులు మొక్కుబడిగా ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. 8లో

గరిష్టం / కనిష్టం
36° / 26°

**వాతావరణం**

జిల్లాలో ఆదివారం ఎండ తీవ్రత ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### రామయ్యకు సువర్ణ తులసీ అర్చన



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

**భద్రాచలం:** భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానంలో శనివారం సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తొలుత తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం మేళతాళాల నడుమ గర్భ గుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు.

### నూతన సీహెచ్‌పీ ఏర్పాటుకు సన్నాహాలు



డంప్ చేసిన సిమెంట్ స్లీపర్లు

**సింగరేణి(కొత్తగూడెం):** సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని వీకే–7షాఫ్ట్ గని స్థానంలో వీకే–7 ఓసీ ఏర్పాటుకు యాజమాన్యం చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలో ఏరియాలోని ఫిల్టర్‌బెడ్, జీఎం ఆఫీస్, ఏరియా వర్క్‌షాపు, సీహెచ్‌పీతోపాటు ఏరియాలోని ఎంవీటీసీ కార్యాలయాలను త్వరలో తరలించనుంది. కొత్తగా కార్యాలయ భవనాలతోపాటు మాయాబజార్ సమీపంలో సీహెచ్‌పీ(కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్) నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ నేపథ్యంలో రైల్వే ట్రాక్ ఏర్పాటుకు అవసరమైన సుమారు 11 వేల టన్నుల సిమెంట్ స్లీపర్లను, ఇనుప సామగ్రిని శనివారం డంప్ చేశారు. ఈ సీహెచ్‌పీ నిర్మాణం పూర్తయితే రుద్రంపూర్‌లో ఉన్న సీహెచ్‌పీని తొలగించనున్నట్లు సమాచారం.

### జమలాపురంలో ప్రత్యేక పూజలు

**ఎర్రుపాలెం:** మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయంలో శనివారం శ్రీవారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత శ్రీవారి పాదంతో పాటు స్వామి మూలవిరాట్‌కు వేదమంత్రాల నడుమ పంచామృతాలతో అభిషేకం చేశారు. ఆతర్వాత స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించి నిత్య కల్యాణం జరిపించారు. అనంతరం రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భారీగా హాజరైన భక్తుల సమక్షాన పల్లకీ సేవ నిర్వహించారు.

# సరికొత్తగా ‘భగీరథ’

**ప్రతీ ఇంటికి నీరివ్వాలని లక్ష్యం**

- యాప్ ద్వారా వివరాల సేకరణ
- నెలాఖరుకు పూర్తవనున్న సర్వే
- సుమారు లక్ష వరకు భగీరథ కనెక్షన్లులేని ఇళ్లు!

**సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం:** తెలంగాణ ఏర్పడ్డాక ఇంటింటికీ సురక్షిత తాగునీరు అందించే లక్ష్యంతో మిషన్ భగీరథ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రస్తుతం మారిన పరిస్థితుల నేపథ్యంలో కొత్తగా ఎంతమందికి నల్లా కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంటుంది. అందుకు ఎంత ఖర్చవుతుందనే వివరాలను ఆరా తీసే పనిలో మిషన్ భగీరథ సిబ్బంది నిమగ్నమయ్యారు. 2011 జనాభా లెక్కల ఆధారంగా మిషన్ భగీరథ పథకానికి 2015లో ప్రణాళిక రూపొందించి ఆ మరుసటి ఏడాది నుంచి నిర్మాణ పనులు ప్రారంభించారు. అప్పటి గణాంకాల ప్రకారం జిల్లాలో 2.40 లక్షల గృహాలు ఉన్నట్టుగా తేలింది. వీటికి తాగునీరు అందించేందుకు పల్లె, పట్నం తేడా లేకుండా ఓవర్‌హెడ్ ట్యాంకులు, సరఫరా పైపులు నిర్మించారు. మిషన్ భగీరథ అమల్లోకి వచ్చేనాటికి జిల్లా వ్యాప్తంగా ఉన్న గృహాల సంఖ్య 2.90 లక్షలుగా అంచనా. దీంతో పథకం ప్రారంభించేనాటికే దాదాపుగా 50 వేల గృహాలు తాగునీటి ప్రణాళికలో లేకుండాపోయాయి. గడిచిన ఎనిమిదేళ్ల కాలంలో జరిగిన అభివృద్ధి, కొత్త కుటుంబాల ఏర్పాటుతో అనేక ఇళ్లు కొత్తగా వచ్చి చేరాయి. దీంతో ఈ సంఖ్య రమారమి లక్ష గృహాల వరకు చేరుకుంటుందని అంచనా. వీటికి రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో ఉన్న గొత్తికోయ గూడేలు, పల్లెలు అదనం. అయితే 2021లో జరగాల్సిన జనాభా లెక్కల కార్యక్రమం వాయిదా పడింది. ఇది ఎప్పుడు జరుగుతుందనే అంశంపై స్పష్టత లేదు.

**పక్కా లెక్కల కోసం..**

రాష్ట్రంలో కొలువుదీరిన కొత్త సర్కార్ మిషన్ భగీరథ ద్వారా ప్రతీ ఇంటికి మంచినీరు అందివ్వాలనే లక్ష్యంతో ఉంది. దీంతో భగీరథ పథకం అందని ఇళ్లు ఎన్ని ఉన్నాయనే లెక్కలు తీసే పనిలో పడింది. ఇందుకోసం మిషన్ భగీరథ పేరుతో మొబైల్ అప్లికేషన్ రూపొందించింది. భగీరథ సిబ్బంది జిల్లాలోని ప్రతీ ఇంటికి తిరుగుతూ వివరాలు సేకరిస్తున్నారు. ఇందులో ప్రస్తుతం నల్లా కనెక్షన్ ఉందా, ట్యాప్ కనెక్షన్ ఇచ్చారా లేక సంప్‌లో నీళ్లు పడుతున్నాయా ? సదరు కుటుంబ ఆర్థిక, సామాజిక పరిస్థితులు ఏంటనే వివరాలను కూడా నమోదు చేస్తున్నారు. ఈ మేరకు దాదాపు 1,200 మంది సిబ్బంది క్షేత్రస్థాయిలో ప్రతీ ఇంటికి వెళ్తున్నారు. ఈ నెల చివరి నాటికి వివరాలను సేకరించడంతోపాటు వాటిని క్రోడీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

**తక్కువ ఖర్చుతో..**

భద్రాద్రి జిల్లా విషయానికే వస్తే దాదాపుగా లక్ష గృహాల వరకు కొత్తగా తాగునీటి కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంటుందని ప్రాథమిక అంచనాలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో ప్రతీ పథకాన్ని భారీగా అమలు చేసే ప్రయత్నం చేశారు. ప్రస్తుతమున్న ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో పథకాల రూపకల్పన, అమలులో ఆచితూచి వ్యవహరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ప్రతిపాదనలు రూపొందించే క్రమంలో మిషన్ భగీరథ యాప్ ద్వారా సేకరించిన సమాచారం ద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువ ఇళ్లకు నీరు అందివ్వడానికి ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల ద్వారా ఈ సామాజిక వర్గాలకు చెందిన వారు అధికంగా ఉండే ప్రాంతాల్లో నీటి సరఫరా చేసేందుకు గల అవకాశాలను పరిగణనలోకి తీసుకోనున్నారు. రాబోయే బడ్జెట్ సమావేశాల నాటికి ప్రతీ అంశంపై పక్కాగా ఉండాలనేది ప్రభుత్వ లక్ష్యంగా ఉంది.



అశ్వాపురం మండలం కుమ్మరిగూడెం వద్ద నిర్మించిన మిషన్ భగీరథ ఇన్‌టేక్‌వెల్

**కొన్నిచోట్ల నీరు ఎక్కని ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు**

మిషన్ భగీరథ ద్వారా ఇప్పటికే నిర్మించిన ట్యాంకులు, మంచినీటి సరఫరా పైపుల్లో జిల్లాలో అనేక చోట్ల లోపాలు తలెత్తాయి. చర్ల, గుండాల, సుజాతనగర్ మండలాల్లోని ఎత్తైన ప్రాంతాల్లోని ఓవర్ హెడ్ ట్యాంకుల్లోకి నీరు ఎక్కడం లేదు. దీంతో గతంలో ఉండే మోటార్ల ద్వారానే కొన్నాళ్లు ట్యాంకుల్లోకి నీరు ఎక్కించినా, ఆ తర్వాత ఆ పని చేయడం మానేశాయి. చివరకు మిషన్ భగీరథ ట్యాంకులు అలంకారప్రాయంగా మారాయి. మరికొన్ని చోట్ల చివరి దశ కనెక్షన్లు పెండింగ్‌లో ఉన్నాయి. వీటితో పాటు సరఫరా పైపుల్లో లీకేజీల సమస్యకు కూడా రాబోయే ప్రణాళికలో పరిష్కారం చూపాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

# కొత్త కలెక్టర్‌గా జితేష్

- ప్రస్తుత కలెక్టర్ ప్రియాంక బదిలీ
- విజయవంతంగా రామనవమి, పార్లమెంట్, అసెంబ్లీ, ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ



నూతన కలెక్టర్ జితేష్ వి పాటిల్

**సూపర్‌బజార్(కొత్తగూడెం):** జిల్లా నూతన కలెక్టర్‌గా 2016 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన జితేష్ వి పాటిల్ నియమితులయ్యారు. కామారెడ్డి కలెక్టర్‌గా పనిచేస్తున్న జితేష్ బదిలీపై ఇక్కడికి వస్తున్నారు. ప్రస్తుత కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల బదిలీ అయ్యారు.

**కామారెడ్డి నుంచి భద్రాద్రి జిల్లాకు...**

నూతన కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఇప్పటివరకు కామారెడ్డి కలెక్టర్‌గా విధులు నిర్వహించారు. మహారాష్ట్రలో పుట్టి పెరిగిన జితేష్ వి పాటిల్ సాంగ్లీలోని వాల్‌చంద్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ నుంచి సివిల్ ఇంజనీరింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేశారు. తర్వాత న్యూ ఢిల్లీలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ అర్కిటెక్చర్ నుంచి మాస్టర్ డిగ్రీ పొందారు. 2016 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన పాటిల్ మహారాష్ట్ర, తెలంగాణలో వివిధ పరిపాలనా పదవులు చేపట్టారు. కామారెడ్డి కలెక్టర్‌గా పోస్టింగ్‌కు ముందు కరీంనగర్ జిల్లా అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వహించారు. ప్రస్తుతం జరిగిన బదిలీలలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్‌గా నియమితులయ్యారు.

### 11 నెలలకే ప్రియాంక బదిలీ..



బదిలీ అయిన కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల

నూతన జిల్లాల ఆవిర్భావం తర్వాత గతేడాది జూలై 15న జిల్లాకు ఐదో కలెక్టర్‌గా ప్రియాంక బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు భువనగిరి జిల్లాలో పనిచేయడంతోపాటు హైదరాబాద్ జీహెచ్‌ఎంసీలో అదనపు కమిషనర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఈమె తొలిసారిగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్‌గా పోస్టింగ్ పొందారు. జిల్లాకు తొలి మహిళా కలెక్టర్ కూడా. కానీ 11 నెలలకే బదిలీ అయ్యారు. కాగా ఆమెకు ఇంకా పోస్టింగ్ ఇవ్వలేదు. శనివారం రాష్ట్రంలో 20 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేయగా, బదిలీ అయినవారిలో ప్రియాంక కూడా ఉన్నారు. గడిచిన 11 నెలల కాలంలో భద్రాచలంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన శ్రీరామనవమి, మహాపట్టాభిషేకం ఉత్సవాలను విజయవంతం చేయడంలో సఫలీకృతులయ్యారు. అదే విధంగా గోదావరి వరదల సందర్భంలో కూడా ఎలాంటి ప్రాణనష్టం జరుగకుండా జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి నిర్వాసితులకు ఆశ్రయం కల్పించడంలో చేసిన కృషి ఫలించింది. ప్రధానంగా అసెంబ్లీ ఎన్నికలు, పార్లమెంట్ ఎన్నికలు, పట్టభద్రుల ఉప ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించి అభినందనలు పొందారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో, అసెంబ్లీ ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో జిల్లా అధికారులకు దిక్సూచిగా నిలిచి అమలుచేయడంలో సక్సెస్ అయ్యారు.

# ఆదివాసీ సంస్కృతిని కాపాడాలి

- ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్

**భద్రాచలం:** ఆదివాసీ సంస్కృతి, మనుగడను కాపాడాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ అన్నారు. శనివారం ఆదివాసీ సకల కళా సంక్షేమ సంఘం డైరెక్టర్ కత్లే శ్రీధర్ బృందం సభ్యులు పీఓను ఆయన చాంబర్‌లో కలిశారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ అంతరించిపోతున్న ఆదివాసీ కళలపై అవగాహన పెంపొందించడం అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం పీఓకు జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్సీఓ వెంకటేశ్వరరాజు, ఆదివాసీ కళా సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి సోయం విక్రమ్, ఐటీడీఏ మ్యూజియం ఇన్‌చార్జ్ వీరస్వామి, రేలా కళా బృంద నాయకురాలు సుధారాణి, కార్యదర్శి ఆనంద్, తిరుపతి, అభిరామ్, తదితరులు పాల్గొన్నారు.

**విద్యుత్ సౌకర్యం కల్పించడం ఆనందాన్నిచ్చింది..**

**దుమ్ముగూడెం :** గిరిజన గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించడం ఆనందాన్నిచ్చిందని భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని సింగవరం, ఎన్.లక్ష్మీపురం గ్రామాల్లో విద్యుత్ సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో సమావేశమై మాట్లాడారు. గ్రామాల్లో పర్యటించినప్పుడు కరెంట్ లేక పడుతున్న ఇబ్బందులను ప్రజలు తనకు వివరించారని తెలిపారు. విద్యుత్ లేకపోవడంతో రెండు గ్రామాల రైతులు వాగు నీటి ఆధారంగా పంటలు సాగు చేసుకునేవారని పేర్కొన్నారు. దీంతో ఎన్పీడీసీఎల్ అధికారులతో మాట్లాడి సబ్సిడీ ద్వారా 117 మంది రైతులకు విద్యుత్ సౌకర్యం కల్పించామన్నారు. విద్యుత్ శాఖ సబ్సిడీ, ఐటీడీఏ సహకారంతో రూ. 18 లక్షలతో సమస్య పరిష్కరించినట్లు తెలిపారు. రైతులు పంటలు సాగు చేసుకుని ఆర్థికంగా వృద్ధి సాధించాలని, తోటి రైతులకు సహకారం అందించాలని సూచించారు. అనంతరం రైతులు పీఓ, ఐటీడీఏ అధికారులు, ఎన్పీడీసీఎల్ అధికారులకు చిరు సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో భాస్కరన్, మునీర్ పాషా, జీవన్ కుమార్, వేణు పాల్గొన్నారు.



సింగవరంలో మాట్లాడుతున్న పీఓ ప్రతీక్ జైన్

# ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ బదిలీ

**వికారాబాద్ జిల్లా కలెక్టర్‌గా పోస్టింగ్**



బదిలీపై వెళ్తున్న భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్

**భద్రాచలం:** భద్రాచలం ఐటీడీఏ పీఓగా పనిచేస్తున్న ప్రతీక్‌జైన్ బదిలీ అయ్యారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్‌గా పోస్టింగ్ ఇస్తూ సీఎస్ శాంతికుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. గతేడాది జూన్ 14న భద్రాచలం ఐటీడీఏ పీఓగా ప్రతీక్‌జైన్ నియమితులయ్యారు. కేవలం 11 నెలలు మాత్రమే పనిచేసినప్పటికీ గిరిజనాభివృద్ధికి, సంక్షేమానికి కృషి చేశారు. ప్రధానంగా గిరిజన విద్యపై ప్రత్యేక దృష్టి సారించారు. విద్యా సంవత్సరం ఆరంభం నుంచే ప్రత్యేక ప్రణాళికను రూపొందించి అమలు పర్చేందుకు ప్రత్యేక బృందం ఏర్పాటు చేశారు. గిరిజన బీఈడీ కళాశాలలో రెగ్యులర్ ప్రిన్స్‌పాల్, అధ్యాపకుల నియామకంతో పాటు పారదర్శకత కోసం డెమోలను సైతం ఈ ఏడాది నిర్వహించారు. ఇక గిరిజన సంస్కృతి సంప్రదాయాలను, వారి ఆచారాలను కాపాడేందుకు, తగిన ప్రచారం కల్పించేందుకు గిరిజన మ్యూజియానికి నిధులు విడుదల చేశారు. పనిచేసిన కొద్ది నెలలైనా గిరిజనులతో మమేకమయ్యేందుకు ప్రయత్నం చేశారు. కాగా ఆయన స్థానంలో పీఓగా ఇంకా ఎవరినీ నియమించలేదు.

# నువు సూర్యుడివి.. చంద్రుడివి

**ఆకాశంలో ఎగిరే గాలిపటం** కళ్లకు కనిపించినా దానికి ఆధారమైన దారాన్ని మాత్రం చూడలేం! అదే మాదిరి కుటుంబ అభ్యున్నతికి అడుగడుగునా పాటుపడే తండ్రి పెద్దగా బయటపడడానికి ఇష్టపడడు. సమాజంలోని ఏ కుటుంబంలోనైనా ఇంతే. పిల్లల పోషణ, వారి నడవడికను తీర్చిదిద్దడంలో తల్లితో పాటు తండ్రి పాత్రా కీలకమేనని చెప్పాలి. ఈనేపథ్యాన నేడు(ఆదివారం) ఫాదర్స్ డే సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు వారు రాజకీయాల్లో రాణించడానికి తండ్రి ఇచ్చిన స్ఫూర్తి, ప్రోత్సాహాన్ని వెల్లడించారు. ఆ వివరాలు వారి మాటల్లోనే...



- అందరికీ రోల్ మోడల్‌గా నాన్న
- కుటుంబ ఉన్నతిలో ఆయనే కీలకం

**నేడు ఫాదర్స్ డే**

### నా ఉన్నతిని కళ్లారా చూశాడు...



తండ్రి పుల్లయ్య, సోదరుడు సురేందర్‌తో కనకయ్య

**ఇల్లెందు:** మా నాన్న కోరం పుల్లయ్య నా ఉన్నతిని కనులారా చూశాడు. గ్రామ స్థాయి కార్యకర్త నుంచి ఎమ్మెల్యే స్థాయికి ఎదుగుతున్న క్రమంలో కష్టపడుతుంటే ఏనాడూ రాజకీయాలు మనకెందుకని అడ్డు చెప్పలేదు. వ్యవసాయ కుటుంబమే అయినా ఎప్పుడు పనులకు రావాలని ఒత్తిడి చేయలేదు. ఎంత కష్టమైనా ఆయనే భరించాడు. అంతేకాక తోటి వారితో ఎలా మెలగాలి... ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాల్సిన ఆవశ్యకతను వివరించేవాడు. అప్పట్లో మా ఊరిలో స్కూల్ లేకపోతే ఇల్లెందు, కొత్తగూడెం వెళ్లి చదువుకునేలా ప్రోత్సహించారు. నేను జెడ్పీటీసీగా, ఎమ్మెల్యేగా, జెడ్పీ చైర్మన్‌గా ఏ స్థాయిలో ఉన్నా నాన్న యోగక్షేమాలు తెలుసుకుంటూ చివరి అంకంలో ఆయనకు సపర్యలు చేసి కాస్తయినా రుణం తీర్చుకున్నా.

– కోరం కనకయ్య, ఎమ్మెల్యే, ఇల్లెందు

### నాన్నే నాకు దిక్సూచి



**అశ్వారావుపేట:** రాజకీయంగా నాకు దిక్సూచిలా మా నాన్న సత్యనారాయణ నిలిచాడు. మారుమూల గ్రామమైన గండుగులపల్లిలో సాధారణ రైతుగా ఉన్న నాన్న నన్ను ఉన్నత చదువులు చదివించేందుకు ఎంతో శ్రమించారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉంటూ ప్రజాసేవ చేయాలని నేను పడుతున్న తపనను అర్థం చేసుకుని వెన్నుతట్టి ప్రోత్సహించారు. అయితే, అందరు రాజకీయ నాయకుల మాదిరిగా కాకుండా ప్రజాసేవకు అంకితం కావాలని సూచించేవారు. ప్రజలకు మరింత చేరువగా సేవలు అందించాలని చెప్పేవారు. రాజకీయంగా నేను ఏ నిర్ణయం తీసుకున్నా ఇప్పటికీ నాన్ననే తొలుత సంప్రదిస్తా. ఎన్నికల ప్రచారంలో చేయదగిన వాగ్దానాలు మాత్రమే చేయాలని చెప్పేవారు. ఇలా నా రాజకీయ ఎదుగుదలలో మా నాన్న పాత్ర చాలా కీలకమైంది.



తండ్రి సత్యనారాయణతో ఆదినారాయణ

– జారే ఆదినారాయణ, ఎమ్మెల్యే, అశ్వారావుపేట

### నాకు రోల్‌మోడల్..



తల్లిదండ్రులతో రాగమయి

**సత్తుపల్లి:** మా నాన్న ఎన్‌సీహెచ్.ఏసురత్నం వ్యవసాయ శాఖ ఏడీఏగా రిటైర్ అయ్యారు. మా స్వగ్రామం ఏపీలోని కర్నూలు జిల్లా పోతిరెడ్డిపాడు. నాన్న క్రమశిక్షణకు మారుపేరు. కుటుంబంలో నేను తొలి సంతానం కావడంతో ప్రత్యేక ప్రేమ కనబర్చేవారు. నాన్న రోల్‌మోడల్‌గా నిలుస్తూ చదువు విషయంలో సూచనలు చేయగా.. నన్ను వైద్యురాలిగా తీర్చిదిద్దాలనే ఆయన శ్రమ ఫలించింది. నేను వైద్య వృత్తిని చేపట్టేటప్పుడు ఎంతో గర్వపడుతూ బంధువులు, మిత్రులతో గొప్పగా చెప్పారు. నాన్న సూచనలతోనే తమ్ముళ్లు కిరణ్, కిషోర్ కూడా వైద్యవృత్తిలో స్థిరపడ్డారు. ఇక పెళ్లి తర్వాత నా అత్తగారి కుటుంబానికి రాజకీయ నేపథ్యం ఉండడం.. నా భర్త మట్టా దయానంద్ వైద్య వృత్తితో పాటు రాజకీయాల్లో కొనసాగుతుండడంతో రాజకీయం మా ఇంటి పేరైంది. 2014లో ప్రభుత్వ వైద్యురాలిగా పనిచేస్తూనే క్రియాశీలక రాజకీయాల్లోకి వచ్చేటప్పుడు నాన్న వెన్నుతట్టి ప్రోత్సహించారు. గత ఏడాది అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి దిగుతున్నప్పుడు నాన్న ఆశీర్వదించగా.. గెలిచాక పోతిరెడ్డిపాడులో కూడా నాన్న సంబురాలు నిర్వహించి తన ఆనందాన్ని పంచుకున్నారు.

– డాక్టర్ మట్టా రాగమయి, ఎమ్మెల్యే, సత్తుపల్లి

### ఎన్నిసార్లు శుభాకాంక్షలు చెప్పినా సరిపోదు



**మణుగూరు టౌన్:** ఇప్పుడు ఫాదర్స్ డే అని ప్రత్యేకంగా జరుపుకుంటున్నారు కానీ కొడుకు – తండ్రి మధ్య అనుబంధం ఎంత చెప్పినా తనివి తీరదు. ఎన్ని సార్లు శుభాకాంక్షలు చెప్పినా సరిపోదు. మా నాన్న పాయం కామరాజు మణుగూరు సింగరేణి ఓసీ–1లో కేబుల్ మెన్‌గా పనిచేసేవారు. నాకు ఏ లోటు లేకుండా పెంచడంతో పాటు సమాజంలో ఎలా ఉండాలి... ఇతరులతో నడుచుకోవాల్సిన తీరు వివరించేవారు. ఆయన కష్టానికి తోడు చేసిన సూచనలతోనే ఈ స్థాయికి చేరాను. చదువు విషయంలో ప్రోత్సహించడమే కాక విద్యార్థుల సమస్యలపై పోరాడినా ఏ రోజూ అడ్డు చెప్పింది లేదు. మధ్య తరగతి రైతు కుటుంబమైనప్పటికీ వెన్నుదన్నుగా ఉండి నాన్నతో పాటు కుటుంబం మొత్తం నాకు ఎంతో సహకరించారు. విద్యార్థి ఉద్యమాల నుంచి క్రమ క్రమంగా రాజకీయాల్లోకి అడుగు పెట్టి ఇప్పుడు ఈ స్థాయికి చేరాను. అయితే, నాన్న 2013లో కన్నుమూయడం.. ఇప్పుడు మా మధ్య లేకపోవడాన్ని తలుచుకుంటే బాధగా అనిపిస్తుంది.

– పాయం వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే, పినపాక


### రాజకీయాల్లో ఎదగాలి అనేవారు..



**వైరా:** మా నాన్న మాలోతు హనుమ రైతు. నేను చదువుకుంటూనే రాజకీయాల్లో వస్తున్న వేళ నాన్న ఇచ్చిన ప్రోత్సాహం మరువలేనిది. అయితే, రాజకీయాల్లో కొనసాగాలన్నా, రాణించాలన్నా పలుకుబడితో పాటుగా ప్రజల్లో మంచి పేరు ప్రతిష్టలు సంపాదించాలని చెప్పేవారు. అందుకోసం ప్రజలకు నమ్మకంగా ఉండి వారి అవసరాల్లో తోడుగా నిలిస్తేనే అభిమానం సొంతమవుతుందని పదేపదే సూచించేవారు. 2004లో మా నాన్న మృతి చెందినా ఆయన చెప్పిన మాటలు.. ఆయన జ్ఞాపకాలు నా వెంటే నిలుస్తాయి.

– మాలోతు రాందాస్ నాయక్, ఎమ్మెల్యే, వైరా

### ఆయన స్ఫూర్తితోనే ఈ స్థాయికి...



**సింగరేణి(కొత్తగూడెం):** మాది ఏపీలోని గుంటూరు జిల్లా సంగపాలెం గ్రామం. నాన్న వెంకటరత్నం వాళ్లది రైతు కుంటుంబం. ఊరిలో పెద్ద మనిషి కావడంతో ఎవరికి ఏ అవసరం వచ్చినా నాన్న, బాబాయిల వద్దకు వచ్చి సలహాలు తీసుకునేవారు. నేను తిరుపతిలోని ఆశ్రమ పాఠశాలలో సంస్కృతం చదువుతుండగా.. సెలవుల్లో ఇంటికి వస్తే సమాజంపై అవగాహన పెరిగేలా వివిధ పుస్తకాలు చదివించేవారు. ఇక రాజకీయాల్లో ప్రవేశిస్తున్నప్పుడు అన్ని అవగాహన పెంచుకొని ప్రజలకు మంచి జరిగేలా చూడాలని సూచించారు. ఎన్నడూ తప్పు చేయొద్దని.. ప్రజలకు కూడా తప్పుడు సలహాలు ఇవ్వొద్దని గట్టిగా చెప్పారు. ప్రజలకు ఏ వేళ, ఎలాంటి కష్టం వచ్చినా వెన్నంటి ఉంటే ఎప్పటికీ గుర్తుంచుకుంటారని చెప్పేవారు. ఆయన స్ఫూర్తి.. నేర్పిన పాఠాలే నన్ను ఈ స్థాయికి చేర్చాయి.

– కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్యే, కొత్తగూడెం

## క్లుప్తంగా

### ఈపీ ఆపరేటర్ల శిక్షణకు వాహనం



ప్రైవేట్ వాహనంతో శిక్షణ ఇప్పిస్తున్న సెక్యూరిటీ ఆఫీసర్

సాక్షి ఎఫెక్ట్..

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలోని 11 ఏరియాల్లో 68 ఈపీ ఆపరేటర్ పోస్టుల భర్తీకి 1,700 మంది పోటీపడుతుండగా, ఈ నెల 18 నుంచి నైపుణ్య పరీక్షలు నిర్వహించనున్నారు. అయితే, శిక్షణ కోసం సంస్థ తరఫున భారీ వాహనం సమకూర్చడంపై అధికారులు పట్టింపులేనట్లు వ్యవహరిస్తున్నారని అభ్యర్థులు, కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్న అంశంపై శనివారం 'సాక్షి'లో 'సింగరేణిలో ఈపీ ఆపరేటర్ల శిక్షణకు వాహనాలు కరువు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో యాజమాన్యం శనివారం బొగ్గు లోడింగ్‌కు వచ్చిన లారీని కేటాయించారు. ఈ సందర్భంగా ఏరియా సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ వి.శ్రీనివాసరావు ఆధ్వర్యాన వాహనాన్ని సమకూర్చడంతో పలువురు శిక్షణ పొందారు.

### రామయ్య సేవలో త్రిదండి రామచంద్ర జీయర్ స్వామి



రామాలయంలో రామచంద్ర జీయర్ స్వామి

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారిని త్రిదండి రామచంద్ర జీయర్ స్వామి శనివారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. ప్రధాన ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన ఆయనకు జ్ఞాపికతో పాటు ప్రసాదాన్ని అర్చకులు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమాదేవి, అర్చకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### జాబ్‌మేళాకు విశేష స్పందన




నియామక పత్రాలు అందజేస్తున్న విజేత

సూపర్‌బజార్(కొత్తగూడెం): కలెక్టరేట్‌లో జిల్లా ఉపాధి కల్పనాధికారి వేల్పుల విజేత ఆధ్వర్యంలో శనివారం జరిగిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. అపోలో ఫార్మసీ, సాయి అంజనా మోటార్స్ కంపెనీలు ఈ మేళాలో పాల్గొన్నాయి. మొత్తం 220 మంది అభ్యర్థులు హాజరు కాగా 102 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వారిలో 92 మంది అపోలో ఫార్మసీకి, 10 మంది సాయి అంజనా మోటార్స్‌కు ఎంపిక కాగా, వారికి నియామక పత్రాలు అందజేశారు.

### ఖమ్మం ఆర్‌ఎంగా సరిరామ్

ప్రస్తుత ఆర్‌ఎం వెంకన్న సీఎంఈగా బదిలీ



సరిరామ్

ఖమ్మంమయూరిసెంటర్: ఆర్టీసీ రంగారెడ్డి రీజియన్ డిప్యూటీ ఆర్‌ఎంగా ఉన్న సరి రామ్ పదోన్నతిపై ఖమ్మం ఆర్‌ఎంగా నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఖమ్మం ఆర్‌ఎంగా పని చేస్తున్న చెరుకుపల్లి వెంకన్నను టీజీ ఆర్టీసీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్‌గా నియమిస్తూ శనివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. రెండు రోజుల్లో వెంకన్న రిలీవ్ కానుండగా, సరిరామ్ బాధ్యతలు స్వీకరించారు. కాగా, ఖమ్మం ఆర్‌ఎంగా 2023 జులై 27న బాధ్యతలు చేపట్టిన వెంకన్న సంస్థ అభివృద్ధికి విశేషంగా కృషి చేశారన్న పేరుంది. సంస్థ లక్ష్యాల సాధనకు ప్రణాళికాయుతంగా పనిచేస్తూ 11 రీజియన్లలో ఖమ్మంను మొదటి స్థానంలో నిలిపారు. ఏడాది కాలంలోనే 80 మందికి ఉద్యోగోన్నతులు కల్పించడమే కాక ప్రత్యేక పరిస్థితుల్లో విన్నవించుకున్న వంద మందికి బదిలీ అవకాశం ఇచ్చారు. అంతే కాక ఇల్లందు బస్ డిపో ఏర్పాటుకు కృషి చేసిన వెంకన్న.. మేడారం జాతర, శ్రీరామనవమి వేడుకలు, ఇతర సెలవులు, వివిధ సందర్భాల్లో ప్రయాణికుల కోసం ప్రత్యేక బస్సులు నడిపించి సంస్థకు గణనీయమైన ఆదాయం సమకూర్చారు. ఏళ్లుగా అద్దె భవనంలో కొనసాగుతున్న ఆర్‌ఎం కార్యాలయాన్ని పాత బస్టాండ్‌లోకి మార్చడమే కాక కార్మికుల సంక్షేమం, సంస్థ అభివృద్ధిని సమపాళ్లలో చూశారని ఉద్యోగులు, సిబ్బంది ప్రశంసించారు.

### ఐదుగురు బైండోవర్

దుమ్ముగూడెం: మండలంలోని జిన్నెలగూడెం, గోవిందాపురం, పిరాయిగూడెం గ్రామాలకు చెందిన ఐదుగురు నాటుసారా విక్రేతలను తహసీల్దార్ చంద్రశేఖర్ ఎదుట ఎక్సైజ్ ఎస్‌ఐ సాయిరాం శనివారం బైండోవర్ చేశారు. ఎక్సైజ్ సీఐ రహీమున్నీసాబేగం ఆదేశాల మేరకు ఎక్సైజ్ అధికారులు గతంలో నాటుసారా విక్రయించిన ఘటనలో కేసులు నమోదు కావడంతో వారిని బైండోవర్ చేవారు. కార్యక్రమంలో ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ అలీ, కానిస్టేబుళ్లు రెహమాన్, లలిత, మనోహర్ పాల్గొన్నారు.

# నిర్లక్ష్యంగా ఫిట్‌నెస్ టెస్టులు

- ఫిట్‌నెస్ లేని విద్యాసంస్థల బస్సులు
- జిల్లావ్యాప్తంగా విద్యా సంస్థల బస్సులు 229
- ఫిట్‌నెస్ టెస్టు సాధించనవి 141
- జిల్లాలో మూడు బస్సులకు జరిమానా




బస్సు ఫిట్‌నెస్ పత్రాలను తనిఖీ చేస్తున్న ఆర్టీఓ కిషన్‌రావు (ఫైల్)

కొత్తగూడెంటౌన్: జిల్లావ్యాప్తంగా విద్యాసంస్థలకు చెందిన బస్సులు మొత్తం 229 ఉండగా అందులో చాలావరకు ఫిట్‌గా లేవని సమాచారం. కానీ, కొన్ని విద్యాసంస్థల యాజమాన్యాలు రవాణాశాఖ అధికారుల చేతులు తడిపి సుమారు 141 బస్సులకు ఫిట్‌నెస్ ధ్రువపత్రాలు సాధించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. అధికారులు మొక్కుబడిగా ఫిట్‌నెస్ టెస్టులు నిర్వహించారనే విమర్శలు వినిపిస్తున్నాయి. జూన్ 5వ తేదీ వరకు 229 బస్సుల్లో ఒక్క బస్సుకు కూడా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకనప్పటికీ 14వ తేదీ వచ్చేసరికి దాదాపు 141 బస్సులకు ఫిట్‌నెస్ టెస్టులు నిర్వహించినట్లు అధికారులు చెబుతుండటం అనుమానాలకు తావిస్తోంది.

**మే 15వ తేదీకి ముగిసిన గడువు..**

విద్యాసంస్థల బస్సులకు మే 15వ తేదీతో ఫిట్‌నెస్ గడువు ముగిసింది. అప్పటి నుంచి బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించడంలో ఆయా యాజమాన్యాలు అలసత్వం వహించాయి. అందుకు అధికారుల నిర్లక్ష్యం కూడా తోడైంది. జూన్ 2వ తేదీ వరకు ఆర్టీఏ కార్యాలయానికి రాని బస్సులు.. కొన్ని రోజులుగా వరుస కడుతున్నాయి. అయితే, ఇక్కడే పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జూన్ 5వ తేదీ వరకు ఒక్క బస్సుకు కూడా ఫిట్‌నెస్ ధ్రువపత్రం ఇవ్వని అధికారులు 14వ తేదీ వచ్చేసరికి దాదాపు 141 బస్సులకు ఫిట్‌నెస్ టెస్ట్ చేసి సర్టిఫికెట్లు ఇచ్చినట్లు చెబుతున్నారు. భద్రాచలంలో రెండు, కొత్తగూడెంలో ఒక బస్సుకు జరిమానా విధించామని చెబుతున్నారు. 12 రోజుల వ్యవధిలో దాదాపు 141 బస్సులు ఫిట్‌నెస్ సాధించడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలు అధికారులకు లంచం ఇచ్చి.. తూతూమంత్రంగా ఫిట్‌నెస్ టెస్టులు చేయించి, సర్టిఫికెట్లు సాధించినట్లు విశ్వసనీయ సమాచారం. కొన్నిరోజులుగా ఆర్టీఏ అధికారులు జిల్లా వ్యాప్తంగా దాడులు నిర్వహిస్తున్నారు. వాహన తనిఖీలు చేపడుతున్నారు. కానీ, వందల సంఖ్యలో బస్సులు ఉంటే తూతూమంత్రంగా రెండు, మూడు బస్సులకు జరిమానా విధిస్తూ 'మమ' అనిపిస్తున్నారని తెలుస్తోంది. అయితే, ఫిట్‌గాలేని బస్సులను రోడ్లపై తిప్పి, విద్యార్థుల ప్రాణాలకు ముప్పు తెస్తే ఎవరు బాధ్యత వహిస్తారనే ఆందోళన ప్రస్తుతం వ్యక్తమవుతోంది. కాగా, 11 బస్సులకు లైఫ్‌టైం ముగిసిందని, 15 బస్సులకు నోటీసులు ఇచ్చామని, మరో 77 బస్సులకు ఫిట్‌నెస్ టెస్టులు చేయాల్సి ఉందని ఇన్‌చార్జ్ ఆర్టీఓ కిషన్‌రావు తెలిపారు.

**ఫిట్‌నెస్ టెస్టులు చేశాం**



జిల్లావ్యాప్తంగా విద్యా సంస్థలకు చెందిన దాదాపు 141 బస్సులకు ఫిట్‌నెస్ టెస్టులు చేశాం. 11 బస్సులకు లైఫ్‌టైం ముగిసింది. 15 విద్యా సంస్థలకు చెందిన బస్సులకు నోటీసులను అందజేశాం. ఇంకా 77 స్కూల్‌బస్సులకు ఫిట్‌నెస్ టెస్టులు చేయాల్సి ఉంది. ఫిట్‌నెస్ లేకుండా బస్సులు తిరిగితే జరిమానా విధిస్తాం. ప్రతి ఒక్కరూ తమ వాహనాలకు ఫిట్‌నెస్ టెస్టులు చేయించుకోవాలి. అన్ని అనుమతులు ఉంటేనే వాహనాలను నడపాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయి.

– కిషన్‌రావు, ఇన్‌చార్జ్ ఆర్టీఓ, భద్రాద్రి జిల్లా

## మహానేత వైఎస్సార్ ఆశయాలను సాధించాలి

రాజ్యసభ మాజీ సభ్యుడు కేవీపీ.రామచంద్రరావు



కేవీపీకి జ్ఞాపిక అందచేస్తున్న పొదెం, నాయకులు

చర్ల: దివంగత మహానేత డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి ఆశయాలను సాధించేందుకు ప్రతిఒక్కరూ పాటుపడాలని రాజ్యసభ మాజీ సభ్యుడు కేవీపీ. రామచంద్రరావు కోరారు. శనివారం చర్లకు వచ్చిన ఆయన స్థానిక గ్రంథాలయ ఆవరణలో తామ్రపత్ర గ్రహీత, కాంగ్రెస్ నాయకుడు చింతల చెర్వు వెంకటాద్రి, రైస్‌పేటలో స్వాతంత్ర్య సమరయోధుడు సీవీకే.రావు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం హైకోర్టు న్యాయవాది, సీవీకే.రావు కుమారులు సీహెచ్.సతీష్‌కుమార్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వైఎస్సార్ రాజశేఖరరెడ్డి ఆశయ సాధనకు సీవీకే.రావు ఎంతగానో తపించారని గుర్తుచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడిపించిన మహనీయుడు వైఎస్సార్ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని సూచించారు.

**కేవీపీని కలిసిన మాజీ ఎమ్మెల్యే పొదెం**

భద్రాచలం: భద్రాచలం వచ్చిన మాజీ ఎంపీ కేవీపీ.రామచంద్రరావును భద్రాచలం మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు నల్లపు దుర్గాప్రసాదరావు, చింతిరేల రవికుమార్, రౌతు నర్సింహారావు, చీమలమర్రి మురళీకృష్ణ, ఆవుల విజయభాస్కర్‌రెడ్డి, గుండేపూడి భాస్కర్‌రావు, చీమకుర్తి వీరభద్రం, సుంద సురేష్‌కుమార్, కారంపూడి సాల్మన్‌రాజు, పరిమి శ్రీనివాసరావు, చింతిరాల సుధీర్‌కుమార్, వరుణ్, వాసిరెడ్డి సాంబశివరావు, సుంకర శేషు, తడికల లాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# మట్టి అక్రమ రవాణా?

సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ నుంచి తరలింపు



తరిగిపోతున్న సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ మట్టి గుట్ట

అశ్వాపురం: మండలంలోని మొండికుంట గ్రామ శివారు నుంచి కృష్ణసాగర్ అటవీ ప్రాంతం వరకు సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ మట్టిని గుట్టగా పోశారు. దీనిని కొందరు అక్రమంగా రవాణా చేసి, సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం. కొందరు ట్రాక్టర్ల యజమానులు రాత్రి సమయాల్లో జేసీబీలతో మట్టి తోడి.. వందల సంఖ్యలో ట్రాక్టర్లలో తరలిస్తున్నట్లు తెలుస్తోంది. సీతారామ ప్రాజెక్ట్ కెనాల్‌కు అడ్డుకట్టగా ఉన్న మట్టి తరలిపోతుండటంతో భవిష్యత్తులో కెనాల్‌కు ప్రమాదం పొంచి ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. కొంతకాలంగా సీతారామ ప్రాజెక్ట్ మట్టిని యథేచ్ఛగా తరలిస్తున్నా ఇరిగేషన్, మైనింగ్, పోలీస్, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు దృష్టి సారించి సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ మట్టి అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తున్న పాలకులు




మాట్లాడుతున్న ప్రొఫెసర్ యుగల్ రాయలు

పాల్వంచ: ప్రజలు ఎన్నుకున్న పాలకులు దేశాన్ని పెట్టుబడిదారుల చేతుల్లో పెడుతున్నారని ప్రొఫెసర్ యుగల్ రాయలు అన్నారు. స్థానిక సాయితేజ కాన్ఫరెన్స్‌హాల్లో నిర్వహిస్తున్న సీపీఐ రాజకీయ శిక్షణ తరగతులు శనివారం రెండోరోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా యుగల్ రాయలు 'నూతన ఆర్థిక విధానాలు, ప్రభుత్వ రంగ సంస్థల విధ్వంసం' అనే అంశంపై మాట్లాడారు. దేశంలో వ్యవస్థ గాడి తప్పుతోందని, పేదలు ఇంకా పేదలుగా, సంపన్నులు ఇంకా సంపన్నులుగా మారుతున్నారన్నారు. సంపద కొందరి చేతుల్లోనే ఉందని, దాని ఫలాలు వారికి మాత్రమే అందుతున్నాయని, పెద్ద చదువులు చదివిన వారు సైతం చిన్నపాటి జీతాలతో గడుపుతున్న పరిస్థితులు అనేకం ఉన్నాయని తెలిపారు. అధికారం చేపట్టిన తర్వాత ప్రజా శ్రేయస్సు కోసం ఆలోచించాల్సిన పాలకులు ప్రతి అంశాన్ని రాజకీయాలతో ముడిపెడుతున్నారని దుయ్యబట్టారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా మాట్లాడారు. కార్యక్రమంలో బొల్లోజు అయోధ్య, ముత్యాల విశ్వనాథం, ఏపూరి బ్రహ్మం, నరెడ్డి పుల్లారెడ్డి, సలీం, చంద్రగిరి శ్రీనివాసరావు, కమటం వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, ఎల్లయ్య, నరాటి ప్రసాద్, మున్నా లక్ష్మీకుమారి, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, అడుసుమల్లి సాయిబాబు, దస్రు, సుధాకర్, పద్మానాభరాజు, రామచందర్, నాగయ్య, కేశవులు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### పేకాట స్థావరాలపై దాడులు

దమ్మపేట: మండలంలోని నాగుపల్లి గ్రామ శివారు లో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. శనివారం మండలంలోని నాగుపల్లి గ్రామ శివారులోని వ్యవసాయ క్షేత్రంలో పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. నలుగురు పారిపోయారు. వారివద్ద నుంచి ఎనిమిది మోటారు సైకిళ్లు, రూ.12,140 నగదును స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని ఎస్‌ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు.

**పాల్వంచ మండలంలో..**

పాల్వంచరూరల్: పేకాడుతున్న ఆరుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. మండలంలోని కోడిపుంజులవాగు శివారులో పేకాట స్థావరంపై శనివారం ఎస్‌ఐ శ్రీనివాస్ దాడి చేసి, ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఆరుగురు పరారయ్యారు. వారి వద్ద నుంచి రూ.11,420 నగదును స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

### దూసుకొచ్చిన ట్రాక్టర్



షాపు వద్దకు దూసుకొచ్చిన ట్రాక్టర్

అన్నపురెడ్డిపల్లి: అతి వేగంతో ట్రాక్టర్‌ను నడపటంతో అదుపు తప్పి షాపు వద్దకు దూసుకొచ్చిన ఘటన శనివారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని ప్రధాన సెంటర్‌లో ట్రాక్టర్ డ్రైవర్ సవలం చందు అతి వేగంగా ట్రాక్టర్‌ను నడపడంతో అదుపుతప్పి షాపు వద్దకు దూసుకొచ్చింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనం, కుట్టుమిషన్, బోర్డు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రమాద సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదు. ద్విచక్రవాహనదారుడు ఆచంటి ఆంజనేయులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### పంచాయతీ ట్రాక్టర్ బోల్తా

బూర్గంపాడు: సారపాక గ్రామ పంచాయతీకి చెందిన ట్రాక్టర్ చెత్తను డంపింగ్ యార్డుకు తరలిస్తున్న క్రమంలో అదుపుతప్పి బోల్తా పడింది. శనివారం చెత్తను డంపింగ్ యార్డుకు ట్రాక్టర్‌లో తరలిస్తున్న క్రమంలో భాస్కర్‌నగర్ వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ట్రాక్టర్‌పై ఉన్న పారిశుద్ధ్య కార్మికుడు రవికి తీవ్ర గాయాలు కాగా, స్థానికులు భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పంచాయతీ కార్యదర్శి మహేశ్ ఆస్పత్రికి చేరుకుని క్షతగాత్రుడిని భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

WANTED
Daily walk-in Interviews
ENGLISH, SOCIAL, NS, PS, MATHS
Salary: 19,000 to 20,000
Little Flowers High School (E/M)
BHADRACHALAM.
Cell : 9618001900

## ఎదురెదురుగా రెండు లారీలు ఢీ..

- ఒక డ్రైవర్ దుర్మరణం
- కేబిన్‌లో ఇరుక్కున్న మరో డ్రైవర్‌ను శ్రమించి బయటకు తీసిన సీఐ



సుంకే రమేశ్ (ఫైల్)

అశ్వారావుపేటరూరల్: ఎదురెదురుగా వచ్చిన రెండు లారీలు ఢీకొన్న ఘటనలో ఒక లారీడ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందగా, మరో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన శనివారం తెల్లవారుజామున అశ్వారావుపేట మండలం నారంవారిగూడెం సమీపంలోని శ్రీ విజయదుర్గ అమ్మవారి ఆలయం వద్ద చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా చిల్లకల్లు నుంచి ఒడిశాకు సిమెంట్‌లోడ్‌తో వెళ్తున్న లారీ మరో వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే క్రమంలో పూర్తిగా ఎడమ వైపు రాగా, ఇదే సమయంలో విశాఖపట్నం నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న లారీని అదుపుతప్పి ఢీకొట్టింది. దీంతో రెండు లారీల క్యాబిన్లు నుజ్జునుజ్జు కాగా.. ప్రకాశం జిల్లా సింగరాయకొండకు చెందిన డ్రైవర్ సుంకే రమేశ్ (40) అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మరో లారీడ్రైవర్, సూర్యాపేట జిల్లా ఆత్మకూర్‌కు చెందిన బయ్య మధు క్యాబిన్‌లో ఇరుక్కుపోగా.. రెండు కాళ్లు, చేతులు విరిగాయి. ఆయన్ను ఖమ్మం తరలించారు. మృతుడు రమేశ్‌కు భార్య, ఇద్దరు కుమారులున్నారు.



లారీ క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్ మధును బయటకు తీస్తున్న సీఐ

**క్యాబిన్‌లో ఇరుక్కుపోయి నరకయాతన**

లారీలు ఎదురెదురుగా ఢీకొనడంతో డ్రైవర్ మధు క్యాబిన్‌లోనే ఇరుక్కుపోయాడు. కాళ్లు, చేతులు విరిగిపోగా బయటకు రాలేక దాదాపు గంటన్నర పాటు నరకయాతన అనుభవించాడు. అశ్వారావుపేట సీఐ జితేందర్‌రెడ్డి, సిబ్బందితో సహా చేరుకుని మధును జేసీబీ సాయంతో అరగంటకుపైగానే శ్రమించి బయటకు తీశారు. అనంతరం ఆయన్ను స్వయంగా సీఐ ఎత్తుకొని అంబులెన్స్‌లోకి ఎక్కించి స్థానిక ఆస్పత్రికి తరలించారు. కాగా, ఈ ప్రమాదంతో దాదాపు ఐదు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోగా ఎస్‌ఐ శ్రీను ఆధ్వర్యంలో రాకపోకలను పునరుద్ధరించారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చుంచుపల్లి: కొత్తగూడెం బైపాస్ రోడ్డులో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని పెనగడప అంబేడ్కర్ నగర్ గ్రామానికి చెందిన ఇనుముల నవీన్ (35) ద్విచక్రవాహనంపై బైపాస్ రోడ్డులో పెట్రోల్ బంక్‌కు వెళ్లి తిరిగి రోడ్డు దాటుతుండగా ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఢీకొట్టింది. పోలీసులు చేరుకుని తీవ్రంగా గాయపడిన నవీన్‌ను 108 ద్వారా ఏరియాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఘటనపై చుంచుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, వాసిరెడ్డి మురళి, కౌన్సిలర్లు యూసుఫ్, సత్యనారాయణచారి సందర్శించి నివాళులర్పించారు.

### చికిత్స పొందుతున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగి..



నరసింహారావు (ఫైల్)

అశ్వారావుపేటరూరల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న మిషన్ భగీరథ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి మృతి చెందారు. ఎస్‌ఐ శ్రీను కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా కల్లూరు మండలం లోకవరానికి చెందిన కోలా నరసింహారావు (40) అశ్వారావుపేటలోని మిషన్ భగీరథ యూనిట్ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ విధానంలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 10న రాత్రి అశ్వారావుపేట నుంచి స్వగ్రామానికి వెళ్లేందుకు కెమికల్ లోడుతో విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్తున్న డీసీఎం వ్యాన్ ఎక్కాడు. అయితే, నారంవారిగూడెం వద్ద ఆగి ఉన్న లారీని వ్యాన్ ఢీకొట్టగా వ్యాన్‌లో ఉన్న నరసింహారావుతోపాటు మరో ఉద్యోగి దామాల రాంబాబు, వ్యాన్ డ్రైవర్ శ్రీను గాయపడ్డారు. ఈ మేరకు నరసింహారావుకు స్థానికంగా చికిత్స అనంతరం హైదరాబాద్ తరలించగా పరిస్థితి విషమించడంతో శనివారం మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

### పాండురంగాపురంలో గొర్రెలు చోరీ

పాల్వంచరూరల్: మండలంలోని పాండురంగాపురం గ్రామానికి చెందిన ఎల్లావుల వెంకన్నకు చెందిన రూ.45 వేల విలువ గల నాలుగు గొర్రెలను గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారని బాధితుడు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గత జనవరిలో కూడా ఇదే గ్రామంలో లింగయ్యకు చెందిన ఐదు గొర్రెలు చోరీకి గురైనట్లు తెలిసింది. ఏఎస్‌ఐ సుధాకర్‌ను వివరణ కోరగా గొర్రెలు చోరీకి గురైనట్లు ఫిర్యాదు అందిందని, ఇంకా కేసు నమోదు చేయలేదని తెలిపారు.

**చిన్నతండాలో...**

జూలూరుపాడు: మండలంలోని మాచినేనిపేటతండా జీపీ చిన్నతండాకు చెందిన గుగులోత్ మిట్టులాల్ ఇంట్లో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. బాధితుడి కథనం ప్రకారం.. ఇంట్లో మిట్టులాల్ ఒక్కడే నిద్రిస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు తలుపులు పగలగొట్టి లోపలికి వచ్చారు. కత్తితో పొడిచి చంపుతా మంటూ బెదిరించి డబ్బులు, నగలు ఉంటే ఇవ్వాలని అడిగారు. ఇనుప బీరువాలో ఉన్న రూ.60,000 నగదు తీసి వాళ్లకు ఇచ్చినట్లు బాధితుడు మిట్టులాల్ చెప్పాడు. ముగ్గురు దుండగుల్లో ఒకరు బయట ఉండగా మిగిలిన ఇద్దరు ఇంట్లోకి వచ్చినప్పుడు తాను అడ్డుకునే ప్రయత్నం చేశానని, అయితే దుండగులు కత్తులతో దాడి చేయడంతో తన చేతులకు గాయాలైనట్లు బాధితుడు వాపోయాడు. దుండగులు డబ్బు తీసుకొని వాహనంలో పారిపోయినట్లు తెలిపాడు. ఈ ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేసినట్లు బాధితుడు పేర్కొన్నాడు.

### అంగన్‌వాడీ కేంద్రంలో గ్యాస్ సిలిండర్ చోరీ

సుజాతనగర్: అంగన్‌వాడీ కేంద్రంలో గ్యాస్ సిలిండర్ చోరీకి గురైన ఘటన శనివారం వెలుగుచూసింది. కేశవాపురం అంగన్‌వాడీ కేంద్రంలోకి శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి, సిలిండర్ ఎత్తుకెళ్లారు. శనివారం ఉదయం కేంద్రంలోకి ఆయా వెళ్లేసరికి తలుపులు తెరిచి ఉండటంతో పాటు ఖాళీ గ్యాస్ సిలిండర్ చోరీకి గురైనట్లు గుర్తించారు. అంగన్‌వాడీ టీచర్ హేమలత పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### మోటార్, స్టార్టర్, కాపర్ వైరు..

బోనకల్: మండలంలోని కలకోటలో ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకానికి సంబంధించిన 40హెచ్‌పీ విద్యుత్ మోటార్, స్టార్టర్, కాపర్ వైర్ చోరీకి గురైంది. ఈనెల 8వ తేదీన చోరీ జరిగినట్లు తెలుస్తుండగా శనివారం వెలుగులోకి వచ్చింది. బోనకల్ మండలం మోటమర్రి, మధిర మండలం బయ్యారం సరిహద్దుల్లో కలకోట వద్ద ఏర్పాటు చేసిన లిఫ్ట్‌కు రెండు మోటార్లు బిగించారు. ఇందులో ఒక మోటార్, స్టార్టర్‌తో పాటు కాపర్ వైరు చోరీకి గురైనట్లు నీటి సంఘం మాజీ అధ్యక్షుడు చిట్టుమోదు ఆదినారాయణ, చిట్టుమోదు వెంకటేశ్వర్లు, బోజెడ్ల నాగేశ్వరరావు తెలిపారు. తొలుత వీరు మధిరలో ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా బోనకల్ పరిధిలోకి వస్తుందని చెప్పడంతో ఇక్కడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, ఈ లిఫ్ట్ కింద మోటమర్రి రెవెన్యూ పరిధిలో చెందిన 250 ఎకరాల భూమి సాగవుతుందని రైతులు తెలిపారు.

### విద్యుదాఘాతంతో మహిళ మృతి



వెంకటరమణ మృతదేహం

కరకగూడెం: విద్యుదాఘాతంతో ఓ మహిళ మృతి చెందిన ఘటన పినపాక మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని మల్లారం గ్రామానికి చెందిన మహిళ మద్దెల వెంకటరమణ (48) శనివారం ఉదయం ఇంట్లో మోటార్ వేసేందుకు కరెంట్ వైర్ స్విచ్ బోర్డులో పెడుతుండగా ఒక్కసారిగా విద్యుదాఘాతానికి గురై కుప్పకూలింది. గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు 108లో పినపాక ప్రాథమిక కేంద్రానికి తరలించి అక్కడి వైద్యురాలి సూచన మేరకు మణుగూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏడూళ్లబయ్యారం పోలీసులు తెలిపారు.

### ఫుడ్ పాయిజన్‌తో యువకుడు..!



సాయిరాహుల్ (ఫైల్)

దుమ్ముగూడెం: మండలంలోని దుమ్ముగూడెం గ్రామానికి చెందిన యువకుడు బైరెడ్డి సాయిరాహుల్ (24) ఫుడ్ పాయిజన్ జరిగి హైదరాబాద్‌లో మృతి చెందినట్లు సమాచారం. సాయిరాహుల్ హైదరాబాద్‌లో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవల తన స్నేహితులతో కలిసి హోటల్‌లో బిర్యానీ తిన్నాడు. మరుసటి రోజు నుంచి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే స్నేహితులు ఓ ప్రైవేట్ వైద్యశాలలో చేర్పించారు. పరిస్థితి విషమంగా మారి శనివారం ఉదయం మృతి చెందాడు. మృతదేహాన్ని అంబులెన్స్‌లో దుమ్ముగూడెం గ్రామానికి తీసుకొచ్చారు. మృతుడి తండ్రి బైరెడ్డి సాయి ఆర్‌ఎంపీగా పనిచేస్తున్నాడు.

## సాక్షి సండే క్లాసిఫైడ్స్

Real Estate

**FLAT FOR SALE**

■ మమత రోడ్‌లో శ్రీ చైతన్య ఒలంపియాడ్ స్కూల్ ఎదురుగా SRK-1 లో Flat No. 203 & 301, SFT 1467 2 BHK తూర్పుఫేస్ అమ్మకమునకు కలదు. Cell: 9848517751, 9949529033. [M-845]

■ PSR రోడ్, శ్రీశ్రీ సర్కిల్, మమత హాస్పిటల్ రోడ్‌లో నూతనంగా నిర్మితమైన 2 BKH, 3 BHK, 1600, 1700 Sft. కలిగిన East Phasing ఫ్లాట్స్ అమ్మకానికి కలవు. 8977994636, 9063219448 [M-750]

**TO-LET**

■ ఖమ్మం, నెహ్రూ నగర్ అంకుర/ఆరాధ్య హాస్పిటల్ ప్రక్కన 5000 Sft., 3 స్టేర్ బిల్డింగ్ హాస్పిటల్‌కు అద్దెకు ఇవ్వబడును. వివరాలకు సంప్ర. సెల్ : 73826 64450. [M-1185202]

**LAND FOR LEASE**

■ శ్రీశైలం హైవేకి అనుకొని ముచ్చెర్ల క్రాస్‌లో 3000 గజాలు DTCP 95x288 ft, 3 పక్కల BT రోడ్డు E/F వ్యాపారాలకు అనుకూలం. సంప్ర।। 9441922102 [HA-1927]

Wanted

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 95026 15217 [M-1185211]

■ ఖమ్మం, వైరారోడ్డులో గల జిరాక్స్ & ఇంటర్నెట్ సెంటర్ నందు పని చేయుటకు యువతీ యువకులు కావలెను. మరియు కంప్యూటర్ వర్క్ నేర్చుకుందామనే ఆసక్తి ఉన్నవారు సంప్ర. సెల్ : 7013 9468 74 [M-11761]

■ విజయవాడలో పెద్దవారిని/బెడ్ పేషెంట్‌లని వారి ఇంటి వద్దనే ఉండి చూసుకొనుటకు కేర్‌టేకర్స్ M/F, ఆయాలు, నర్సులు కావలెను. వసతి + భోజనం + మంచి జీతం. ✆ 91608 35559, 98850 25559 [B-108]

■ గైనకాలజిస్ట్ & OT టెక్నీషియన్ కావలెను. అన్ని సదుపాయాలు గల ములుగు, వరంగల్‌లోని ఒక హాస్పిటల్‌లో ఫుల్ టైమ్ కొరకు సంప్రదించండి నెం. 9949015656. [Z-1060589]

■ పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర।। 9391912949, 040-40123376. [H-800412]

■ శ్రీశ్రీశ్రీ హీరో షోరూం ఖమ్మం నందు పని చేయుటకు మేనేజర్స్ కావలెను. అర్హత : ఏదైనా డిగ్రీ, 5 సం।।రాల అనుభవం కలిగి ఉండవలెను. ఇంటర్వ్యూ : 17-6-24 ఉదయం 11 గం।।లకు. షోరూం నందు సంప్ర।। 99499 11636. [M-1185216]

**OLD AGE HOME**

■ ఒమేగా హోంకేర్ వంట / ఇంటిపని చేయుటకు, వృద్ధులను, పేషెంట్స్‌ను, చిన్న పిల్లలను 24 గం।।లు చూసుకొనుటకు మీ ఇంటికే కేర్‌టేకర్స్‌ను పంపబడును. హైదరాబాద్. ఫోన్ 8977639664 / 8977639665 [H-799891]

సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి
వివరాలకు :
ఖమ్మం : 9010299957, 9705444182
కొత్తగూడెం : 9010223783
పాల్వంచ : 9705444183
భద్రాచలం : 9951602914
మణుగూరు : 9705944416
సత్తుపల్లి : 9652868642
మధిర : 9949927792

సాక్షి ద్వారా మీ చిన్నారి పుట్టిన రోజు శుభాకాంక్షలను తెలియజేయండి
కేవలం రూ. 500/- మాత్రమే
(GST 5% అదనం)

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## ఆగని టీడీపీ దాడులు.. పెరిగిన విధ్వంసం

# తీరు మారలేదు!

- మాజీ మంత్రి పేర్ని నాని ఇంటివైపు దూసుకెళ్లేందుకు టీడీపీ శ్రేణుల యత్నం
- రాళ్ల దాడి చేయడంతో పోలీసులకు గాయాలు
- పుంగనూరులో దళిత, బీసీ నేతలపై దాడి.. హత్యాయత్నం
- విజయవాడలో వైఎస్సార్‌సీపీ నేతల ఇళ్లు, దుకాణాల కూల్చివేత


పల్నాడు జిల్లా గొట్టిపాళ్లలో టీడీపీ నాయకులు ధ్వంసం చేసిన వైఎస్సార్‌సీపీ నాయకుడి ఇల్లు

■ టీడీపీ నేతల దాడులు, దౌర్జన్యాలు, ఇళ్లు, శిలా ఫలకాల ధ్వంసం వంటి దుశ్చర్యలు ఆగటం లేదు. మచిలీపట్నంలో విజయోత్సవ ర్యాలీ ముసుగులో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులకు తెగబడ్డారు. మాజీ మంత్రి పేర్ని నాని ఇంటి వైపు రాళ్లు విసరగా.. పోలీసులకూ రాళ్ల దెబ్బలు తగిలాయి. కర్నూలు జిల్లా దిగువచింతలకొండలో వైఎస్సార్‌సీపీ నాయకుడు సోమశేఖర్‌పై టీడీపీ వర్గీయులు దాడికి పాల్పడ్డారు. చిత్తూరు జిల్లా పుంగనూరులో దళిత నేత, ఇద్దరు బీసీ నాయకులపై టీడీపీ నేతలు, కార్యకర్తలు దాడులకు పాల్పడ్డారు. బీసీ నేత వెంకటరెడ్డి యాదవ్‌పై ఇనుప రాడ్లతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. అనంతపురం జిల్లా మురడిలో పోలీసుల సమక్షంలోనే వైఎస్సార్‌సీపీ కార్యకర్త రవీంద్రనాథ్‌రెడ్డిపై దాడికి తెగబడ్డారు. ఇంట్లోకి చొరబడి సామగ్రిని ధ్వంసం చేశారు. విజయవాడలో వైఎస్సార్‌సీపీ నేతల ఇళ్లు, దుకాణాల కూల్చివేశారు. మాజీ డిప్యూటీ మేయర్, మరో నాయకుడి కార్ల అద్దాలను ధ్వంసం చేశారు. టీడీపీ నేతల ప్రోద్బలంతో విజయవాడ నగరపాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ అధికారులు ఆక్రమణల పేరిట వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఇళ్లను కూల్చివేశారు. పల్నాడు జిల్లా గొట్టిపాళ్లలో వైఎస్సార్‌సీపీ నేతల గృహాల్లోని సామగ్రిని దహనం చేశారు.

## ఆగని ధ్వంసరచన

**ఏపీలో కొనసాగుతున్న సచివాలయం, ఆర్‌బీకే శిలాఫలకాలు, ఆర్చిల ధ్వంసం**

- తణుకు మండలం మండపాకలో సచివాలయం, ఆర్‌బీకే శిలాఫలకాల ధ్వంసం
- నూజివీడులో అభివృద్ధి పనుల శిలాఫలకాలు కూల్చివేత
- ప్రకాశం జిల్లా చినమనగుండంలో టీడీపీ శ్రేణుల దుశ్చర్య
- చీమకుర్తి నూతన మునిసిపల్ కార్యాలయంపై వైఎస్సార్ పేరు తొలగింపు

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

## చినబాబు బ్యాచ్ చిత్రహింసలు!

**మోకాళ్లపై మోకరిల్లి లోకేష్ ఫ్లెక్సీ ఎదుట క్షమాపణ చెప్పాలని బెదిరించారు**

- సీజేఐ, హైకోర్టు సీజే, మానవ హక్కుల కమిషన్‌కు బాధితుడు పాలేటి రాజ్‌కుమార్ ఫిర్యాదు
- నన్ను కిడ్నాప్ చేసి రాత్రంతా చిత్రహింసలకు గురి చేశారు
- ఆ దృశ్యాలను చిత్రీకరించి సోషల్ మీడియాలో వీడియో పోస్ట్ చేశారు
- స్కూల్‌లో చదివే నా పిల్లలు అవమాన భారంతో ఇంటికొస్తున్నారు
- వైఎస్సార్‌సీపీ మద్దతుదారులపై విచ్చలవిడిగా దాడులు
- మానవ హక్కులు, భావ ప్రకటన స్వేచ్ఛను కాపాడాలని విన్నపం

**సాక్షి, అమరావతి:** మంగళగిరి ఎమ్మెల్యే, మంత్రి నారా లోకేష్ అనుచరులు ఈనెల 9వతేదీన తనను కిడ్నాప్ చేసి రాత్రంతా చిత్ర హింసలకు గురి చేసినట్లు పెదవడ్లపూడికి చెందిన బాధితుడు పాలేటి రాజ్‌కుమార్ సుప్రీం కోర్టు, హైకోర్టు, జాతీయ మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేశాడు. లోకేష్ ఫ్లెక్సీ ఎదుట మోకాళ్లపై కూర్చోబెట్టి బెదిరించి క్షమాపణ చెప్పించి చిత్రీకరించిన వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసి తన కుటుంబాన్ని మానసిక క్షోభకు గురి చేస్తున్నట్లు పేర్కొన్నాడు. వీటి ప్రభావంతో పాఠశాలలో చదువుతున్న తన పిల్లలు అవమానభారంతో ఇంటికొస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. టీడీపీ నేతలు పదే పదే బెదిరింపులకు దిగుతున్నారని, తక్షణమే జోక్యం చేసుకుని అరికట్టకుంటే తన కుటుంబానికి ఆత్మహత్యే శరణ్యమని విన్నవించుకున్నాడు. ఈ మేరకు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, జాతీయ మానవహక్కుల సంఘానికి శుక్రవారం ఫిర్యాదు చేశారు. తన ఫిర్యాదుపై చట్టప్రకారం పోలీసులతో విచారణ జరిపి వ్యక్తిగత, భావ ప్రకటన స్వేచ్ఛ, మానవ హక్కులను పరిరక్షించాలని కోరాడు. ఫిర్యాదులో ముఖ్యాంశాలు ఇవీ..

- మంగళగిరి నియోజకవర్గంలో 2019–24 మధ్య వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలను మా కుటుంబంతో కలసి ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేశా. ఎన్నికల ఫలితాలు వెల్లడైనప్పటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ నేతలు, కార్యకర్తలు కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నేతలపై దాడులకు పాల్పడుతూ చిత్రహింసలకు గురిచేస్తున్నారు. ఆస్తులను ధ్వంసం చేస్తూ భయోత్పాతం సృష్టిస్తున్నారు. నారా లోకేష్ అండదండలతో మంగళగిరి నియోజకవర్గంలో టీడీపీ కార్యకర్తలు పేట్రేగిపోతున్నారు.
- ఈ నెల 9వతేదీన సాయంత్రం 4.30 గంటల సమయంలో నారా లోకేష్‌కు సన్నిహితుడైన జవ్వాడి కిరణ్‌చంద్ అనుచరులు నరేంద్ర, షేక్ బాజీ, జానీ తదితరులు నేను మా అత్త ఇంట్లో ఉన్న సమయంలో మారణాయుధాలతో దాడి చేశారు. ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. ఏపీ 39 జీబీ 3333 వాహనంలో నన్ను కిడ్నాప్ చేసి గుర్తు తెలియని ప్రాంతానికి తరలించి రాత్రంతా చిత్ర హింసలకు గురిచేశారు. నా చొక్కా విప్పించి నారా లోకేష్ ఫ్లెక్సీ ఎదుట మోకాళ్లపై మోకరిల్లి ముకుళిత హస్తాలతో క్షమాపణ చెప్పాలని బెదిరించి వీడియో చిత్రీకరించారు. ఈనెల 10వతేదీ తెల్లవారు జాము 4 గంటలకు బోయపాలెం వద్ద జాతీయ రహదారిపై వదిలేసి వైఎస్సార్ సీపీకి మద్దతు పలికితే ఎవరికైనా ఇదే గతి పడుతుందని హెచ్చరించారు.
- నాపై దాడి చేసిన వారిపై అదే రోజు మధ్యాహ్నం 3.30 గంటలకు పల్నాడు జిల్లా చిలకలూరిపేట రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు (ఎఫ్ఐఆర్ నెంబరు 78/2024) చేశా. ఫిర్యాదు వాపసు తీసుకోవాలంటూ టీడీపీ మద్దతుదారులు పదే పదే ఫోన్ చేసి బెదిరిస్తున్నారు. అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గిన పోలీసులు నా ఫిర్యాదుపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.
- మానవ హక్కులను కాలరాయడంపై తక్షణమే జోక్యం చేసుకుని టీడీపీ నేతలు, కార్యకర్తల నుంచి నాకు, నా కుటుంబానికి రక్షణ కల్పించాలి. నా ఫిర్యాదుపై చట్టప్రకారం విచారణకు ఆదేశించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని విన్నవించుకుంటున్నా.

# ‘సెర్చ్’ ఏదీ ?

- వర్సిటీల వీసీల ఎంపికకు ఇంకా భేటీ అవ్వని కమిటీలు
- మూడువారాలుగా ఐఏఎస్‌ల చేతుల్లోనే ఇన్‌చార్జ్ బాధ్యతలు

**సాక్షి, హైదరాబాద్ :** యూనివర్సిటీల వీసీల నియామకంలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. రాష్ట్రంలోని పది విశ్వవిద్యాలయాల వైస్ చాన్స్‌లర్ల(వీసీ) ఎంపికకు సంబంధించి ప్రభుత్వం నియమించిన సెర్చ్ కమిటీలు ఇప్పటివరకూ ఒక్కసారి కూడా సమావేశం కాలేదు. అన్ని వర్సిటీల్లోనూ ఐఏఎస్‌లే కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. వారికి ఇతర బాధ్యతలు ఉండటంతో వర్సిటీలపై పెద్దగా దృష్టి పెట్టలేకపోతున్నారు. సాధారణ కార్యకలాపాలకు కూడా అధికారుల అనుమతి తీసుకోవాల్సి వస్తోంది. ఐఏఎస్‌లంతా హైదరాబాద్‌లోనే ఉండటంతో వర్సిటీల్లోని సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. విద్యా సంవత్సరం మొదలవ్వడంతో వర్సిటీలు కీలకమైన బాధ్యతలు చేపట్టాల్సి ఉంటుంది. జేఎన్‌టీయూహెచ్‌లో అనుబంధ గుర్తింపు, కోర్సుల మార్పిడి వంటి వాటి విషయంలోనూ ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రైవేట్ కాలేజీలు అంటున్నాయి. మరోవైపు ఐఏఎస్‌లు అధికారులు అందుబాటులో లేకపోవడంతో ఉన్నత విద్యామండలి కూడా యూనివర్సిటీ వ్యవహారాలపై ముందుకెళ్లే పరిస్థితి లేదు. కొత్త కోర్సులు, వాటికి సంబంధించిన బోధన ప్రణాళికపై ఏ నిర్ణయం తీసుకునే అవకాశం లేకుండాపోయిందని మండలివర్గాలు అంటున్నాయి. వీసీల పదవీ కాలం మే 21తో ముగిసింది. దీంతో కొత్తవారి నియామకానికి ప్రభుత్వం సెర్చ్ కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ ప్రక్రియ పూర్తయ్యే వరకూ ఐఏఎస్ అధికారులకు వీసీలుగా అదనపు బాధ్యతలు అప్పగించింది.



సెర్చ్ కమిటీలు ఏమైనట్టు?

వీసీ ఎంపికకు గత నెలలోనే ప్రభుత్వం సెర్చ్ కమిటీలను ఏర్పాటు చేసింది. నిపుణులతో కూడిన ఈ కమిటీలు వచ్చిన దరఖాస్తులను వడపోయాలి. అంతిమంగా ముగ్గురిని ఎంపిక చేసి, ప్రభుత్వానికి సిఫార్సు చేయాలి. ఇందులోంచి ఒకరిని ప్రభుత్వం వీసీగా నియమిస్తుంది. మూడు వారాలైనా ఇంతవరకూ సెర్చ్ కమిటీల భేటీ జరగలేదు. వీసీల ఎంపికలో తీసుకోవాల్సిన ప్రామాణిక అంశాలేమిటో ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. పెద్దఎత్తున దరఖాస్తులు రావడం, అందరూ సాంకేతికంగా వీసీ పోస్టులకు అర్హులే కావడంతో సెర్చ్ కమిటీ స్వతంత్రంగా నిర్ణయం తీసుకునే అవకాశం కనిపించడం లేదని తెలుస్తోంది. వీసీల ఎంపికలో ప్రభుత్వానికి కొన్ని రాజకీయ ప్రాధాన్యతలూ ఉంటాయని నిపుణులు అంటున్నారు. సామాజిక ప్రాధాన్యత ఇందులో కీలకమని భావిస్తున్నారు. వీటిని దృష్టిలో పెట్టుకొని ఎంపిక జరగాల్సి ఉన్నప్పుడు స్పష్టత లేకుండా మేమేం చేయగలమని వారు అంటున్నారు.

### ఒత్తిడే కారణమా...?

- ప్రధాన యూనివర్సిటీల వీసీల కోసం పెద్దఎత్తున ప్రభుత్వంపై రాజకీయ ఒత్తిడి వస్తున్నట్టు తెలుస్తోంది.
- అత్యధికంగా ఇంజనీరింగ్ కాలేజీలకు గుర్తింపు ఇచ్చే జేఎన్‌టీయూహెచ్ వీసీ కోసం కేంద్ర స్థాయిలో కాంగ్రెస్ పెద్దల నుంచే సిఫార్సులు వచ్చినట్టు సమాచారం. నల్లగొండ జిల్లాకు చెందిన ఓ మంత్రి వీసీ పోస్టుకు దరఖాస్తు చేసిన ఓ వ్యక్తి కోసం పట్టుబడుతున్నారు. మరోవైపు నిజామాబాద్‌కు చెందిన మరో కాంగ్రెస్ కీలకనేత మైనారిటీకి చెందిన మరో ప్రొఫెసర్‌కు ఇప్పించేందుకు ఒత్తిడి తెస్తున్నట్టు సమాచారం. జేఎన్‌టీయూహెచ్ వీసీ పోస్టుకు ఎన్ఐటీలో పని చేస్తున్న రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తి పట్ల సీఎంకు సానుకూలత ఉన్నట్టు తెలిసింది. అయితే, తన మాట కన్నా పార్టీలో పెద్దవారికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన పరిస్థితి ఉందని సమాచారం. ఈ కారణంగానే ఇక్కడ సెర్చ్ కమిటీ ఇంతవరకూ భేటీ అవ్వలేదని తెలుస్తోంది.
- ఉస్మానియా యూనివర్సిటీ వీసీ పోస్టుకు ఓ సామాజికవర్గానికి చెందిన వ్యక్తి కోసం విద్యాశాఖ ఉన్నతాధికారి కూడా పావులు కదుపుతున్నారు. సామాజిక కోణంలో ఈ ప్రతిపాదన తీసుకొస్తున్నా, యూనివర్సిటీ వర్గాల నుంచి ఆయనపై తీవ్ర వ్యతిరేకత ఉందని తెలుస్తోంది.
- బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ వీసీ పోస్టుకు కూడా జాతీయ, రాష్ట్ర స్థాయి నేతల చేత పైరవీలు జోరుగా సాగుతున్నాయి. ఈ తరహా ఒత్తిడి రావడంతోనే ప్రభుత్వం సెర్చ్ కమిటీలకు అవసరమైన మార్గదర్శకాలు ఇవ్వలేకపోతోందని ఉన్నతవిద్య వర్గాలు చర్చించుకుంటున్నాయి.

## వనపర్తి జిల్లాలో పండిత గల్లు, ఆత్మాహుతి శిల్పం

**సాక్షి, హైదరాబాద్:** వనపర్తి జిల్లాలో పండిత గల్లు, మహిళ ఆత్మాహుతి శిలలు వెలుగు చూశాయి. ఇందులో పది/పదకొండు శతాబ్దికి చెందిన పండిత శిల అరుదైనది కావటం విశేషం. శత్రువులు, క్రూర జంతువులతో ఆయా ప్రాంతాలను రక్షించే క్రమంలో.. మరణించేవారికి గుర్తుగా అప్పట్లో వీరగల్లులు ఏర్పాటు చేసేవారు. అదే తరహాలో ఆయా ప్రాంతాల్లో అసమాన ప్రతిభ కనబరిచిన పండితులకూ గుర్తింపు శిలలను ఏర్పాటు చేసేవారు. ఇవి చాలా అరుదుగానే వెలుగు చూస్తున్నాయి. తాజాగా వనపర్తి జిల్లా పెబ్బేరు మండల కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న సూగూరు గ్రామం పాటిగడ్డమీద ఇది కనిపించింది. కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యులు చంద్రశేఖర్, శ్యాంసుందర్‌లు దీన్ని గుర్తించారు. సమీపంలోనే, ఆత్మాహుతి చేసుకుని భక్తురాలి స్మారక శిల కూడా కనిపించింది.

**జిల్లా వార్తలు**

## ఆయిల్‌పామ్ బోర్డు ఏర్పాటు చేయాలి

- రాష్ట్రస్థాయి సదస్సులో జూలకంటి రంగారెడ్డి


సదస్సులో మాట్లాడుతున్న రంగారెడ్డి, పక్కన నాయకులు

**అశ్వారావుపేటరూరల్:** పసుపు బోర్డు మాదిరి ఆయిల్‌పామ్ బోర్డును ఏర్పాటు చేస్తే సాగుదారులకు మేలు జరుగుతుందని ఏఐకేఎస్ కేంద్ర కమిటీ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి వెల్లడించారు. అశ్వారావుపేటలో శనివారం తెలంగాణ పామాయిల్ రైతు సంఘం రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో రంగారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ పామాయిల్ సొమ్మును ఫెడరేషన్ పేరుతో కొందరు కాజేస్తున్నారని ఆరోపించారు. వ్యవసాయానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌ను కేటాయించడమే తప్ప ఆ నిధులు సక్రమంగా వెచ్చించడం లేదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం గతేడాది రూ.730 కోట్లు కేటాయించగా అందులో రూ.400 కోట్లు విడుదల చేసి రూ.300 కోట్లే ఖర్చు చేయడం ఇందుకు నిదర్శనమన్నారు. కేంద్ర ప్రభుత్వం రూ.80వేల కోట్లు ఖర్చు చేసి 30లక్షల టన్నుల పామాయిల్‌ను ఇతర దేశాల నుంచి దిగుమతి చేస్తున్న నేపథ్యాన ఇక్కడ సాగును ప్రోత్సహిస్తే నూనె సమృద్ధిగా లభ్యం కావడంతోపాటు విదేశీ మారకద్రవ్యం వస్తుందని చెప్పారు. అనంతరం తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ ఆయిల్‌పామ్ టన్నుకు రూ.25వేల ధర వచ్చేలా కేంద్రం చట్టం చేయాలని కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ పామాయిల్ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ కొక్కెరపాటి పుల్లయ్యతో పాటు తుంబూరు మహేశ్వరరెడ్డి, ఎలమంచిలి వంశీకృష్ణ, అన్నవరం సత్యనారాయణ, ఆళ్ల నాగేశ్వరరావు, భువనేశ్వరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు ఎంపిక పోటీలు

**కొత్తగూడెంటౌన్:** తెలంగాణ క్రీడా పాఠశాలలో 4వ తరగతిలో ప్రవేశాలు కల్పించేందుకు మండల స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు భద్రాద్రి కొత్తగూడెం డీవైఎస్ఓ కె.సంజీవరావు తెలిపారు. హకీంపేటలోని తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో బాలబాలికలకు ప్రవేశాలు కల్పించనుండగా ఈనెల 21 నుంచి 26వ తేదీ వరకు మండల స్థాయి ఎంపిక పోటీలు జరుగుతాయన్నారు. ఇందుకోసం బాలబాలికలు ఆధార్‌కార్డు, వయస్సు, కుల ధ్రువీకరణ పత్రాలు, స్టడీ, పుట్టిన తేదీ సర్టిఫికెట్లు, మూడో తరగతి ప్రోగ్రెస్ రిపోర్ట్, పది పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో హాజరుకావాలని, మండల స్థాయిలో ప్రతిభ కనబర్చిన వారికి జిల్లా స్థాయికి, అక్కడి నుంచి రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయనున్నట్లు డీవైఎస్ఓ పేర్కొన్నారు.

# మల్బరీకి రాయితీల వెల్లువ

- ఆసక్తి ఉన్న రైతుల కోసం ‘సిల్క్ సమగ్ర పథకం’
- మల్బరీ సాగు, పట్టు పరిశ్రమ నిర్వహణపై ప్రత్యేక దృష్టి
- దరఖాస్తులు ఆహ్వానిస్తున్న ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ


మల్బరీ తోట (ఇన్‌సెట్) పట్టు గుడ్లు

**ఖమ్మంవ్యవసాయం:** మల్బరీ సాగు, పట్టు పరిశ్రమ నిర్వహణకు ప్రభుత్వం రాయితీలను ప్రకటించింది. పట్టు గూళ్లకు డిమాండ్ పెరగడంతో పరిశ్రమను ప్రోత్సహించి రైతులకు మేలు చేకూర్చడమే లక్ష్యంగా సిల్క్ సమగ్ర పథకం ద్వారా రాయితీలు కల్పిస్తోంది. రెండేళ్ల క్రితం కిలో రూ.400గా ఉన్న పట్టు గూళ్ల ధర గత ఏడాది రూ.600కు చేరింది. ఇక తెలంగాణ పట్టు గూళ్లకు మరింత డిమాండ్ ఉండగా.. రాష్ట్రంలోని జనగామ, హైదరాబాద్ మార్కెట్లలో పట్టు గూళ్ల ధర అత్యధికంగా పలుకుతోంది. ఈనేపథ్యాన ఆదాయాన్నిచ్చే మల్బరీ సాగు, పట్టు పరిశ్రమల ఏర్పాటు దిశగా రైతులను ప్రోత్సహించేలా పట్టు పరిశ్రమ శాఖ సంకల్పించింది. ఇతర వాణిజ్య పంటల కన్నా మల్బరీ, పట్టు పరిశ్రమతో లాభాలు రానున్నందున రైతుల్లో అవగాహన పెంచే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సిల్క్ సమగ్ర పథకం కింద అమలు చేసే ఈ పథకాన్ని ఎస్సీ, ఎస్టీ రైతులకు, జనరల్ రైతులకు వేర్వేరుగా రాయితీలను ప్రకటించారు.

### దరఖాస్తుల ఆహ్వానం

మల్బరీ సాగు, పట్టు పరిశ్రమ ఏర్పాటుకు ఆసక్తి కలిగిన రైతులు ఉద్యాన, పట్టు పరిశ్రమకు దరఖాస్తు చేసుకోవచ్చు. వివరాల కోసం ఖమ్మం జిల్లా రైతులు అధికారులు కె.సురేష్(99667 57765), ఏ.శ్రీనివాసరావు(90005 01500)ను సంప్రదించాలని సూచిస్తున్నారు.


### సిల్క్ సమగ్ర పథకం ద్వారా రైతులకు రాయితీలు (రూ.ల్లో)

| వివరాలు | జనరల్ | ఎస్సీ / ఎస్టీలు |
|---|---|---|
| 2 ఎకరాల్లో మల్బరీ సాగు | 60,000 | 78,000 |
| నీటి సదుపాయానికి | 50,000 | 65,000 |
| పట్టు రేరింగ్ షెడ్ నిర్మాణం | 2,25,000 | 2,92,000 |
| పరికరాలకు | 37,500 | 48,750 |
| రోగ నిరోధక మందులకు | 2,500 | 3,250 |
| కిసాన్ నర్సరీ (యూనిట్ రూ. 1.50 లక్షలు) | 75,000 | 97,500 |

### మల్బరీ సాగుకు అనుకూల అంశాలు

అతి తక్కువ నీటి వినియోగం ఉంటుంది. మల్బరీ మొక్కలు ఒకసారి నాటితే 10 నుంచి 15 ఏళ్ల వరకు దిగుబడులిస్తాయి. మళ్లీ మళ్లీ నాటాల్సిన పనిలేదు. నల్ల రేగడి, చౌడు నేలలు మినహా అన్ని రకాల భూములు మల్బరీ సాగుకు అనుకూలం. మొదటి ఏడాది మూడు పంటలు, రెండో సంవత్సరం నుండి 6 నుంచి 7 పంటలు తీసుకునే అవకాశం ఉంటుంది. క్రిమి సంహారక మందుల వినియోగం అవసరం ఉండదు.

### నెలవారీ ఆదాయం..



మల్బరీ సాగు, పట్టు పరిశ్రమ నిర్వహణతో నెలవారీ ఆదాయాన్ని గడించవచ్చు. సంప్రదాయ పంటలతో పోలిస్తే అధిక ఆదాయాన్ని పొందొచ్చు. ప్రభుత్వం మల్బరీ సాగు, పట్టు పరిశ్రమ నిర్వహణకు రాయితీలను కల్పిస్తూ ప్రోత్సహిస్తోంది. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పట్టు గూళ్ల ధర కూడా ఆశాజనకంగా ఉన్నందున తక్కువ నీటి వినియోగంతో అధిక దిగుబడి పొందొచ్చు.

– టీ.వీ.రమణ, ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి, ఖమ్మం జిల్లా

### ‘మొక్క’వోని ధైర్యంతో...

గత నెల చివరి వారంతో పాటు ఈనెల అడపాదడపా కురుస్తున్న జల్లులతో ఖమ్మం జిల్లాలోని పలుచోట్ల రైతులు పత్తి విత్తనాలు నాటారు. కానీ ఆ తర్వాత వారం రోజులుగా వర్షాల జాడ లేక విత్తనాలు మొలకెత్తకపోవడంతో అన్నదాతలు అగచాట్లు పడుతున్నారు. కొందరు రైతులు బావులకు మోటార్లు అమర్చి పైపుల ద్వారా పాదుల్లో నీరు పడుతున్నారు. ఆ సౌకర్యం లేని వారు ట్యాంకర్ల ద్వారా నీరు తెప్పించి పడుతుండడం కనిపిస్తోంది.

– బోనకల్


బోనకల్ మండలం ముష్టికుంట్లలో పత్తి విత్తనాలకు పైపుతో నీళ్లు పడుతున్న రైతు

# ఆరోగ్యమే ఆర్టీసీకి భాగ్యం


సత్తుపల్లి డిపోలో పరీక్షలకు హాజరైన ఆర్టీసీ ఉద్యోగులు, వైద్యసిబ్బంది

- ఉద్యోగుల ఫిట్‌నెస్‌పై సంస్థ దృష్టి
- రెండేళ్లలో రెండుసార్లు వైద్యపరీక్షలు
- రీజియన్‌లో 2,081 మందికి పూర్తయిన పరీక్షలు

**సత్తుపల్లిటౌన్:** ఆర్టీసీ ఉద్యోగులు ఆరోగ్యంగా ఉంటేనే ప్రయాణికులకు మెరుగైన సేవలు అందుతాయనే ఉద్దేశంతో సంస్థ ఆ దిశగా దృష్టి సారించింది. ఖమ్మం రీజియన్ పరిధిలో నిత్యం సుమారు 1.80 లక్షల మందికి పైగా ప్రయాణికులను ఆర్టీసీ సిబ్బంది వివిధ ప్రాంతాలకు చేరవేస్తున్నారు. అటు ఉద్యోగుల సంక్షేమం.. ఇటు ప్రయాణికుల భద్రత దృష్ట్యా ఆర్టీసీ ఎండీ సజ్జనార్ సూచనల మేరకు ఆర్టీసీ ఉద్యోగులకు గ్రాండ్ హెల్త్ ప్రోగ్రాం–2 నిర్వహించింది. రీజియన్‌లోని ఖమ్మం, కొత్తగూడెం, మధిర, సత్తుపల్లి, మణుగూరు, భద్రాచలం, డిపోల్లోని ఉద్యోగులందరికీ ఇటీవల ఆరోగ్య పరీక్షలు చేపట్టారు. రీజియన్‌లో 2,081 మంది ఆర్టీసీ ఉద్యోగులే కాక 512 మంది అద్దె బస్సు డ్రైవర్లకు సైతం వైద్య పరీక్షలు నిర్వహించడం విశేషం.

### డిపోల వారీగా వైద్యపరీక్షలు

రీజియన్‌లోని ఆర్టీసీ డిపోల వారీగా ఉద్యోగులు, అద్దెబస్సు డ్రైవర్లకు వైద్య శిబిరాల ద్వారా పరీక్షలు నిర్వహించారు. గ్రాండ్ హెల్త్ చాలెంజ్–2 పేరుతో ఆర్టీసీ అన్ని విభాగాల ఉద్యోగులకు ఈ పరీక్షలు చేయించింది. రెండేళ్ల వ్యవధిలో ఇలాంటి పరీక్షలు చేయించడం ఇది రెండోసారి కావడం విశేషం. ఈ సందర్భంగా 17 రకాల వైద్య పరీక్షలు చేసి హెల్త్ ప్రొఫైల్ అందిస్తున్నారు. రక్త పరీక్షలతో పాటు బీబీఐ, బీపీ, షుగర్, నేత్ర పరీక్షలు, కిడ్నీ, థైరాయిడ్, ఈసీజీ వంటి పరీక్షలను ఒక వైద్యుడు, ముగ్గురు టెక్నీషియన్ల నేతృత్వంలో చేయించారు. హైదరాబాద్‌కు చెందిన ఒక హెల్త్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థతో ఒప్పందం చేసుకుని పరీక్షల ఖర్చులను చెల్లించింది.

### నాలుగు కేటగిరీలుగా..

ఇటీవల నిర్వహించిన శిబిరాల్లో ఖమ్మం డిపోలో ఇద్దరు, మధిర, భద్రాచలంలో ఒకరు చొప్పున ఉద్యోగుల ఆరోగ్య పరిస్థితి క్రిటికల్‌గా ఉన్నట్లు తేలిందని సమాచారం. దీంతో వారిని హైదరాబాద్‌లోని తార్నాక ఆస్పత్రికి పంపించి మరోమారు పరీక్షలు చేయించి ఆపై నిమ్స్‌కు తరలించడంతో మెరుగైన వైద్య సేవలు పొందుతున్నారు. కాగా, డిపోల వారీగా చేయించిన పరీక్షల్లో వచ్చిన ఫలితాల ఆధారంగా ఏ, బీ, సీ, డీ గేటగిరీలుగా ఉద్యోగులను విభజించారు. సంపూర్ణ ఆరోగ్యవంతులు, కొన్ని రుగ్మతలకు దగ్గరగా ఉండి వైద్యపరంగా అప్రమత్తంగా ఉన్నవారు, మరింత లోతుగా విశ్లేషించి వైద్యం అవసరమైన వారు, అత్యంత తీవ్రంగా అనారోగ్య సమస్యలు ఉన్న వారిగా విభజించి చికిత్స అందించారు. ఉద్యోగులను పరీక్షించాక వారి ఆరోగ్య వివరాలను వైద్యులచే కాల్ సెంటర్‌లో ఆన్‌లైన్ చేయించారు. ఆర్టీసీ ఉద్యోగులతో పాటు అద్దె బస్సుడ్రైవర్లు కూడా ఫిట్‌నెస్ ఉండాలనే లక్ష్యంతో వారికి కూడా వైద్య పరీక్షలు చేపట్టడం విశేషం.

### ఖమ్మం రీజియన్‌లో డిపోలో వారీగా ఉద్యోగులు

| డిపో | ఉద్యోగులు |
|---|---|
| ఖమ్మం | 483 |
| సత్తుపల్లి | 324 |
| కొత్తగూడెం | 236 |
| మధిర | 239 |
| భద్రాచలం | 387 |
| ఇల్లెందు | 106 |
| మణుగూరు | 260 |
| ఆర్ఎం కార్యాలయం | 46 |
| మొత్తం | 2,081 |


సత్తుపల్లి డీఎంకు పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

### ఎంతో ఉపయోగకరం..



ఆర్టీసీ ఉద్యోగులకు గ్రాండ్ హెల్త్ చాలెంజ్ ప్రోగ్రాం ఎంతో ఉపయోగకరం. సంస్థ అభివృద్ధిలో కీలకమైన వీరికి వైద్యపరీక్షలు చేయించడం ద్వారా సమస్యలు ఉంటే చికిత్స చేయించుకోవచ్చు. డీఎంహెచ్ఓ సహకారంతో మహిళా ఉద్యోగుల కోసం ఓపీ ట్రీట్‌మెంట్ సదుపాయం కూడా అందించాం. రీజియన్‌లోని ఆరు డిపోల్లో ఇటీవలే క్యాంప్‌లు పూర్తయ్యాయి.

–సీహెచ్.వెంకన్న, ఆర్టీసీ రీజినల్ మేనేజర్, ఖమ్మం